# కార్యవాదులు



ఆదోని లలిత

విశాకన్య తన నల్ల ముసుగును తొలగించుకుంటున్న సమయం. జానకమ్మ ప్రక్కవాటాలో గణగణమని గంట మ్రోగిన శబ్దానికి మేలుకుంది. నైట్ ల్యాంప్ వెలుతురులో మూలనున్న వెంకటేశ్వరస్వామి విగ్రహానికి నమస్కరించి, మంగళసూత్రాలను కళ్ళకద్దుకుని లేచింది. అప్పటికే వరండాలో లైటు వేసుకుని పేపరు చదువుతున్న ఆమె భర్త పరంధామయ్య జానకమ్మను చూడగానే.

"జానకీ! మన పక్కవాటాకు ఎవరో వచ్చినట్టున్నారు. ఇందాక పసిబిడ్డ ఏడుపు కూడా వినిపించింది. నీకు మంచి కాలక్షేపం" అన్నాడు. భర్త మాటకు జానకమ్మ ముసి ముసిగా నవ్వి లోపలికి దారి తీసింది.

పరంధామయ్య దంపతులకు ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారు. కూతురు శ్రీలత కాపురం విజయవాడలో. కొడుకు సుందర్ హైదరాబాదులో ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. పరంధామయ్య సుందర్‌కు సంబంధాలు చూస్తున్నాడు. శ్రీలతకు రెండేళ్ళ బాబున్నాడు. జానకమ్మ కనులలో మనుమడు, భరత్ ముద్దుల రూపమే కదులుతుంటుంది. వాని చిలిపి చేష్టలే మనస్సులో మెదలుతుంటాయి. పరంధామయ్య, జానకమ్మ టిఫిన్ తీసుకుని సుందర్‌కు వచ్చిన పెళ్ళి సంబంధాలను గురించి మాట్లాడుతున్నారు. అంతలో కాలింగ్ బెల్ మ్రోగింది. జానకమ్మ వెళ్ళి తలుపు తీయగా పాతికేళ్ళ అమ్మాయి చేతిలో ప్రసాదం, తాంబూలం ఉన్న ప్లేటుతో నిలబడింది. జానకమ్మ ఆ అమ్మాయిని చూడగానే అర్థం చేసుకుంది ప్రక్క వాటాకు అద్దెకు వచ్చిన వాళ్ళని. వెంటనే సాదరంగా "రామ్మా!" అంటూ ఆహ్వానించింది లోపలికి. ఆమె లోపలికి వచ్చి

"నా పేరు సంగీత అండీ! మేము పక్క పోర్షన్‌కు అద్దెకు వచ్చాము. పూజ అయింది. మీకు ప్రసాదం ఇద్దామని వచ్చాను" అంటూ ప్రసాదం ప్లేటు జానకమ్మకు అందించింది. జానకమ్మ అందుకుని "కూర్చోమ్మా!" అంది ఆప్యాయంగా.

"పరవాలేదండీ! పూజ అయింది. కాస్సేపట్లో సామానంతా వస్తుంది. అన్నీ సర్దుకోవాలి" అంది నిలబడి.

"నిజమేనమ్మా! ఉండు బొట్టు ఇస్తాను" అంటూ ఆమెకు కుంకుమ ఇచ్చి

"కొత్తగా వచ్చారు. ఏ అవసరమొచ్చినా మొహమాటపడకుండా అడుగమ్మా! నాకూ నీ వయసు కూతురుంది" అంది జానకమ్మ.

"అలాగేనండి!" వస్తాను అని.

"బాబాయ్‌గారూ! వస్తానండి" అని పరంధామయ్యకు కూడా చెప్పి వెళ్ళింది వరుస కలుపుతూ. పరవాలేదు. చాలా కలుపుగోలు అమ్మాయి అని మనసులో అనుకున్నాడు పరంధామయ్య. జానకమ్మ ఆ అమ్మాయిని చూసి చాలా సంతోషించింది తనకు మంచి తోడు దొరికినందుకు.

వారం గడిచిపోయింది. ఇల్లు సర్దటం రెండు రోజులలో ముగించి, భార్యా భర్తలు ఆఫీసుకెళ్ళటం ప్రారంభించారు. ఒక రోజు సాయంకాలం ఆఫీసునుండి వచ్చిన సంగీతకు వరండాగ్రిల్‌కు కట్టిన క్యారి బ్యాగ్‌లో పాల ప్యాకెట్ కనిపించలేదు.

"ఏమయిందా? ఒక వేళ పిల్లి ఏదయినా తీసికెళ్ళిందేమో" అనుకుంటూ, జానకమ్మ దగ్గరికెళ్ళి జరిగిన సంగతి చెప్పింది. ఆ మాట విని జానకమ్మ -

"నాలుగు కాళ్ళ పిల్లులే కాదు, రెండు కాళ్ళ పిల్లులు కూడా ఉంటాయి. జాగ్రత్తగా ఉండాలమ్మా! పోనీ! పాలబ్బాయిని ప్యాకెట్ మా ఇంట్లో ఇవ్వమను. నేనెప్పుడూ ఇంట్లోనేగా ఉంటాను. జాగ్రత్తగా తీసి పెడతాను. నీవు రాగానే తీసికెళ్ళు." అంది.

"అలానే పిన్నిగారూ! మీకు ఇబ్బంది పెట్టినట్టవుతుందేమో!"

"ఆ! ఇందులో ఇబ్బందేముందమ్మాయ్! ఇరుగు, పొరుగు అన్నాక ఆమాత్రం సహాయం చేసుకోకపోతే ఎలా? ఉండు ఈ రోజుకు కొంచెం పాలిస్తాను. కాఫీ పెట్టుకుందురుగాని" అంటూ గ్లాసుతో పాలిచ్చింది జానకమ్మ.

కొద్ది రోజులలో, జానకమ్మకు, సంగీతకు బాగా చనువేర్పడింది. సంగీత రోజు వచ్చి పాల ప్యాకెట్

తీసికెళ్ళేది. వీలున్నప్పుడు వచ్చి మాట్లాడేది. సంగీత భర్త సుధాకర్ కూడా అప్పుడప్పుడు పరంధామయ్యతో వచ్చి మాట్లాడేవాడు. వాళ్ళ పదినెలలపాప, దీపను చూసి జానకమ్మ ముచ్చటపడేది. జానకమ్మ వాళ్ళ ఫోన్ నంబరును ముఖ్యమయిన వాళ్ళ కిచ్చారు సుధాకర్ దంపతులు వాళ్ళ సమ్మతి మీద. ఎప్పుడు ఫోన్ వచ్చినా జానకమ్మ ఓపికగా పిలిచేది.

ఒకరోజు మాటల సందర్భంలో జానకమ్మ సంగీతతో, "సంగీతా! మీరిద్దరు ఆఫీసుకెళ్ళేప్పుడు మీ పాపను కూడా తీసికెళ్ళుతున్నారు? ఈ మాట చాలా సార్లు అడుగుదామనుకుంటూ అడుగలేదు" అంది జానకమ్మ.

"దారిలో పాపను క్రష్‌లో వదిలి వెడతాము పిన్నిగారూ! వచ్చేప్పుడు తీసుకుని వస్తాము." అని సంగీత చెప్పిన మాట విని జానకమ్మ చాలా నొచ్చుకుని,

"అయ్యో! అలానా! నేనింకా ఏదో మీవాళ్ళ ఇంట్లో వదిలి వెళ్ళుతున్నారనుకుంటున్నాను. పాపం! పసిబిడ్డ సాయంకాలం మీరు వచ్చేదాకా ఆ క్రష్‌లో ఎలా చూసుకుంటారో ఏమిటో! నేనుండగా అక్కడ వదలివెళ్ళట మెందుకమ్మా! ఆ మాత్రం పాపను చూసుకోలేనా? నేను ఖాళీగానే ఉంటాగా. నాకు పిల్లదానితో కాలక్షేపంగా ఉండటమేగాక సంతోషంగా గడచిపోతుంది" అంది జానకమ్మ. ఆ మాటవిని సంగీత సంబరపడిపోయి జానకమ్మ చేతులు పట్టుకుని,

"పిన్నిగారు! మీదెంత పెద్దమనసు. వేరే గత్యంతరం లేక వదలి వెళ్ళటం. మీరు పాపను చూసుకుంటానంటే అంతకంటే ఏంకావాలి. మీరు మాకెంతో సహాయం చేస్తున్నారు. మీ రుణమెలా తీర్చుకుంటామో?" అంది సంగీత.

"పిచ్చి పిల్లా! అంతంత పెద్దమాట లెందుకమ్మా! నా కూతురు లాంటిదానివి" అంటూ అక్కున చేర్చుకుంది జానకమ్మ.

భార్య భర్తలు ఆఫీసుకెళ్ళుతూ పాపను, పాపకు కావలసిన వస్తువులను జానకమ్మకు అప్పజెప్పి వెళ్ళేవాళ్ళు. సాయంత్రం వాళ్ళు వచ్చేంతవరకు, పాపకు పాలు త్రాగించటం, తినిపించటం, ఆడిపించటం, నిద్రపుచ్చటం లాంటి అన్ని పనులు జానకమ్మ ప్రేమగా చేసేది. పాపకు జానకమ్మతో బాగా చనువేర్పడింది. సంగీత వచ్చి రమ్మని చేతులు చాపితే, రానని జానకమ్మ మెడ చుట్టూ చేతులు వేసి జానకమ్మను అంటుకుపోయేది. ఆ చర్యకు జానకమ్మ మురిసిపోయేది. రోజులు గడుస్తున్నకొద్దీ పాపను వదలి ఉండలేనేమో అనిపించేది జానకమ్మకు. సుధాకర్ వాళ్ళు వచ్చి సంవత్సరం గడచిపోయింది. జానకమ్మ కూతురు కొడుకు వచ్చి వెళ్ళారు.

ఒకరోజు, సుధాకర్ దంపతులు వచ్చి తమకు ఆఫీసు క్వార్టర్సు ఇచ్చారని, క్వార్టర్సు ఇచ్చినందుకు సంతోషంగానూ, వారిని వదలి వెళ్ళుతున్నందుకు బాధగానూ ఉందని చెప్పారు. ఆమాట విని జానకమ్మ స్థాణువైపోయింది. పాప తనకు దూరమవుతుందనుకుంటే ఆమె మనస్సు బాధతో నిండిపోయింది. బాధను దిగమ్రింగి పైకి గంభీరంగా,

"చాలా సంతోషమమ్మా! కానీ, మీరు దూరంగా వెళ్ళుతున్నారంటే మనస్సుకు కష్టంగా ఉంది. అదిగాక పాపను వదలి ఉండటమంటే..." అని అంటుండగానే ఆమె గొంతు దుఃఖంతో పూడుకుపోయింది. మాట పెగలలేదు. సంగీత ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని,

"పిన్నిగారూ! బాధపడకండి. మిమ్మల్ని వదలి వెళ్ళటానికి మాకు మాత్రం బాధగా లేదా? క్వార్టర్సు కొంత దూరమయినా ఇదే ఊరేగా. అప్పుడప్పుడు వస్తుంటాము. అంతా సెటిల్ అయ్యాక వచ్చి మిమ్మల్ని తీసుకెళ్ళతాను. సరేనా పిన్నిగారూ!" అంటూ అనునయించింది.

అనుకున్న ప్రకారం సుధాకర్ దంపతులు క్వార్టర్సుకు వెళ్ళి పోయారు. వారు ఖాళీ చేయగానే ఇంటి యజమాని ఇంటిని కొంత ఆల్టర్ చేయించాలంటూ పని మొదలు పెట్టించాడు.

పదిరోజులు గడచిపోయాయి. సంగీత వాళ్ళు రాలేదు. జానకమ్మకు రోజులు భారంగా గడుస్తున్నాయి. ఒకరోజు మనసుండలేక

"సంగీత వాళ్ళింకా రాలేదేంటండీ!" అని అడిగింది.

"వస్తారు జానకీ! అక్కడంతా సెటిల్ అవ్వాలిగా" అన్నాడు పరంధామయ్య. నెల రోజులు గడచిపోయాయి. వాళ్ళ జాడ లేదు. జానకమ్మ వాళ్ళు వస్తారన్న ఆశతో ఎదురుచూస్తూనే ఉంది. ఆమె నిరీక్షణతోనే ఆరునెలలు గడచిపోయాయి. వారు రాలేదు.

ఒకరోజు సాయంత్రం భార్యా, భర్తలు వరండాలో కూర్చుని మాట్లాడుతున్నారు.

"చూశారండీ! ఆరునెలలు గడిచిపోయాయి. వాళ్ళు రాలేదు. ఇలాంటి మనుషులు కూడా ఉంటారా?" అంది జానకమ్మ బాధగా. ఆమె బాధను అర్థం చేసుకున్న పరంధామయ్య నిట్టూరుస్తూ-

"అనవసరంగా బాధపడకు జానకీ! బహుశా ఇక వాళ్ళు రారు. వాళ్ళు కార్యవాదులు. కొందరంతే. వాళ్ళ అవసరాలకు మనుషులను వాడుకుంటారు. వాళ్ళు చూపే స్నేహం, మంచితనం నిజమయినవి కావు. అవి కేవలం వాళ్ళు అవసరం గడుపుకోటానికే. సంగీత వాళ్ళనే తీసుకో. వాళ్ళకు మన అవసరం చాలా ఉండేది. వాళ్ళు లేనప్పుడు పాలు తీసి పెట్టటానికీ, ఫోన్ కాల్స్ వస్తే పిలవటానికి, పాపను చూసుకోవటానికి ఇలా. వాళ్ళ అవసరానికి నిన్ను వాడుకున్నారు. అవసరం వాళ్ళది గనుక స్నేహంగా, ప్రేమగా మాట్లాడేవారు. అంతేకానీ అది నిజమయిన స్నేహం, ప్రేమ కాదు. అర్థమయిందా? అనవసరంగా మనస్సు పాడుచేసుకోకు. స్నేహానికి, ప్రేమకు మనం కొంత పరిధి ఏర్పరుచుకోవాలి. ఆ పరిధి దాటి ఆప్యాయతను పెంచుకుంటే ఇలా బాధపడక తప్పదు" అని అంటుండగానే ప్రక్క వాటా దగ్గర ఆటో ఆగిన శబ్దం వినిపించింది. అందులోంచి ఒక జంట కొంత సామానుతోనూ, చిన్న బిడ్డతోనూ దిగారు. అది చూసి పరంధామయ్య-

"జానకీ! మన పక్క వాటాకు ఎవరో వస్తున్నారు. నీకు..." అని ఇంకా ఏదో అనబోయి ఆగిపోయాడు. జానకమ్మ నిర్లిప్తంగా అటు చూస్తూండిపోయింది. ❋



## వెరైటీ హీరో

యువతరం హీరోల్లో పవన్‌కళ్యాణ్ తర్వాత మళ్ళీ చిత్రమైన పాపులారిటీ వున్న హీరో వేణు.

వేణు డైలాగ్ చెప్పే విధానం ప్రేక్షకులకి బాగా నచ్చుతుంది. ముఖ్యంగా యూత్‌ని ఎక్కువగా ఎంటర్‌టైన్ చేస్తుంటాడు. వేణు సినిమా రిలీజవుతుందంటే కుర్రకారుకి బఫే డిన్నర్ కెళ్ళిన ఫీలింగ్ కలుగుతుందిట. (ఇంకేం బోర్డింగ్ డబ్బులు మిగుల్తాయి)